ప్రమాదం అంచున ప్రయాణం

అదే బాట.. అదే నిర్లక్ష్యం

- నిబంధనలు ఏ మాత్రం పట్టని ఆటోవాలాలు, ట్రాక్టర్ యాజమాన్యాలు
- పట్టపగలే తిరుగుతున్నా అడిగే నాథుడేడీ?
- అనుకోని ప్రమాదం జరిగితే మూల్యం చెల్లించుకోక తప్పదు


బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద ట్రాక్టర్‌పై మహిళా కార్మికుల ప్రయాణం


పొన్నూరు రోడ్డులో గూడ్స్ ఆటోలో ప్రయాణికుల తరలింపు

పట్నంబజారు: నిబంధనలకు నీళ్లొదిలేశారు.. పట్టపగలే నిబంధనలు అతిక్రమిస్తున్నా.. అడిగే నాథుడేడీ...? పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నా.. అడ్డగోలు పయనిస్తున్నా.. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోంది. గూడ్స్ ఆటోల్లో ప్రయాణికులను సరుకుల్లా తరలిస్తున్నా.. ట్రాక్టర్లపై పగలే కార్మికులను పనుల నిమిత్తం తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇటువంటి ఘటనలపై స్పందించాల్సిన రవాణాశాఖ, ట్రాఫిక్ అధికారులు మొద్దు నిద్రపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ప్రత్తిపాడు సమీపంలోని గొట్టిపాడు వద్ద ఆటో బోల్తా పడి ఏడుగురు మృతి చెందిన సంఘటన ఇప్పటికీ మరిచిపోలేనిదే! ఇటీవల కాకాని రోడ్డులో టాటా మ్యాజిక్ గూడ్స్ వాహనం బోల్తా పడి కొంత మందికి గాయాలైన పరిస్థితులు ఉన్నాయి. అయితే, దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు. ట్రాక్టర్ల పైనుంచి కిందపడి పలువురికి నిత్యం గాయాలవుతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

నిబంధనలకు నీళ్లు

గుంటూరు జిల్లాలో మొత్తం 30,637 ఆటోలు ఉన్నాయి. వాటిలో 8,900 ఆటోలు గూడ్స్ ఆటోలు కాగా, 21,360 ఆటోలు ప్రయాణికులను ఎక్కించుకుని ట్రాన్స్‌పోర్ట్ చేసేవి ఉన్నాయి. సుమారు 15వేల వరకు ఆటోలు (వేరే జిల్లాల్లో రిజిస్ట్రేషన్ జరిగనవి కూడా) గుంటూరు నగరంలో తిరుగుతున్న పరిస్థితులు ఉన్నాయి. దీని వల్ల నగరంలో తిరిగే ఆటోలు సంఖ్య పెరిగేదే కానీ తగ్గేది మాత్రం లేదు. వీటితో పాటుగా సుమారు నగరంలో నిత్యం 200 నుంచి 250 వరకు ట్రాక్టర్లు తిరుగుతూనే ఉన్నాయి. వీటికి తోడు 300పైగా టాటా మ్యాజిక్, 1500పైగా అప్పి ఆటోలు అమరావతి, తెనాలి, నందివెలుగు, మంగళగిరి, పొన్నూరు, పేరేచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేటతో పాటు పలు ప్రాంతాలకు ప్రయాణికులను చేర వేస్తున్నాయి. నగరంలో సుమారుగా 15వేల బజాజ్ డీజిల్ ఆటోలు తిరుగుతున్న పరిస్థితుల్లో పరిమితికి మించి ప్రయాణం, నిబంధనలను పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది.

అడిగేది ఎవరులే?

ప్రయాణికుల తరలింపులో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు వాడకూడదనేది సుస్పష్టం. స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ.. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే కూలీలు, పలు శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాల నుంచి వచ్చే వారిని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల నుంచి తరలిస్తున్నారు. పట్టపగలే నగరంలో నుంచి ఇతర ప్రాంతాలకు గూడ్స్ ఆటోల్లో ప్రయాణం చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవటం లేదు. ముఖ్యంగా నగరంలో టాటా మ్యాజిక్ ఆటోలు అమరావతి, తెనాలి, నందివెలుగు ప్రాంతాలకు పరిమితికి మించి ప్రయాణికులతో తిరుగుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్స్, లాడ్జి సెంటర్ నుంచి ఆటోల్లో కుక్కి ప్రయాణం చేయిస్తున్నారు.

ట్రాక్టర్లు సరే సరి?

నగరంలో ఉదయం 8 గంటల నుండి రాత్రి 9గంటల వరకు భారీ వాహనాలు (లారీ, ట్రాక్టర్, టిప్పర్, ఇతరత్రా) తిరగకూడదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ ఆర్టీవో, పోలీసు అధికారులు కనీసం ఈ విషయంపై పట్టించుకుకోవటంలేదనే విమర్శలు ఉన్నా.. వారు ఆ అంశాన్ని పెడచెవిన పెడుతున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్లు కార్మికులతో పగటి పూటే ప్రయాణం చేయటంతో పాటు ఇసుక, కంకర, ఇటుక వంటివి లోడింగ్, అన్‌లోడ్ చేసే సమయంలో వారిని పైన ఎక్కించుకుని తిరిగేస్తున్నారు. ఇందులో అధికంగా మహిళలే ఉంటున్న పరిస్థితులు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

నిబంధనలు బేఖాతరు చేస్తున్న ఆటోవాలాల తీరుతో ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతోంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకుని ఇతర ప్రాంతాలకు తీసుకుని వెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి. బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పల్నాడు బస్టాండ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్, లాడ్జి సెంటర్‌తో పాటు పలు ప్రాంతాల్లో బస్‌స్టాప్‌ల వద్దే ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లిపోతున్నారు. ఇవన్నీ పట్టించుకోవాల్సిన రవాణాశాఖ అధికారులు మాత్రం మొద్దునిద్రలో మునిగితేలుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



గూడ్స్ ఆటోల్లో ప్రయాణం, ట్రాక్టర్‌ల్లో కార్మికుల తరలింపు, పరిమితికి మించి ప్రయాణం అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రయాణం చేయాలి.

– కె. సీతారామిరెడ్డి (డీటీసీ, గుంటూరు)

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): 11 కేవీ లైన్ మెయింటెనెన్స్ కారణంగా శనివారం గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎస్ కాలనీ, నేతాజీ నగర్, తారకరామా నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు టౌన్–2 డీఈ గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

- సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం డీ–3 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుంటూరు టౌన్ –1 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ ముస్తాక్ అహమ్మద్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రామిరెడ్డి తోట, ప్రకాష్ నగర్, గణేశ్వరావు పేట్, ఓల్డ్ క్లబ్ రోడ్ గుంటూరు వారి తోట, పొన్నూరు రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన వెల్లడించారు.
- విద్యుత్ లైనుల మరమ్మతుల కారణంగా నవభారత్ నగర్ 1, 2, 4, సిద్ధార్థ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంరి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుంటూరు –2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.

మదరసాలో విద్యా సామగ్రి పంపిణీ




గుంటూరు మెడికల్: హోప్ విన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ పుట్టిన రోజు సందర్భంగా మదర్‌సాలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు రెడ్డిపాలెంలో ఉన్న మానవతా సేవా సమితి, శ్రీరాజేంద్రసూరి జైన్ సేవా సమితి, వయో వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ షమ సుల్తానా, ట్రామా అండ్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బషీరుద్దీన్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ జీవీఎస్ రాహుల్ రెడ్డి, జనరల్ మెడిసిన్ అండ్ దయాబెటాలజిస్ట్ డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ ఆనంద్, డాక్టర్ మురళి, హోప్ విన్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎంసీ ఉద్యోగి సస్పెన్షన్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉద్యోగి ఎల్ నాగేశ్వరావును నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సస్పెండ్ చేశారు. అకౌంట్స్ సెక్షన్‌లో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడిన అంశంలో అకౌంటెంట్– 2గా పనిచేసిన (ప్రస్తుతం ఇంజినీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్) నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీమద్భగవద్గీతలోని 11వ అధ్యాయం విశ్వరూప సందర్శనయోగంపైఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. కాకరపర్తి వెంకటనారాయణరావు, ప్రమీలాదేవి దంపతుల సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి భక్తులకు శ్రీకృష్ణ పరమాత్మ విశిష్టతను వివరించారు.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

చేబ్రోలు: హ్యాండ్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం. ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. అక్టోబర్ 26వ తేదీ నుంచి 28 వరకు తెనాలి రాష్ట్రస్థాయి అండర్- 14 స్కూల్ గేమ్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో గుంటూరు జిల్లా జట్టు అద్భుతమైన ప్రదర్శన చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. దీనిలో నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతికి చెందిన వి. హరీష్, వై. అనీల్, 8వ తరగతికి చెందిన పి. కార్తీక్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రేపు పట్టాభి కళాపీఠం పురస్కారాల ప్రదానం

నగరంపాలెం: ఈ ఏడాదికి నవరత్నాలు పేరుతో తొమ్మిది మంది ప్రముఖులను సత్కరించనున్నట్లు డాక్టర్ పట్టాభి కళాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 24న గుంటూరు బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్డులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగే 14వ వార్షికోత్సవ సభలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఎ.మానస (నాట్యం), డాక్టర్ జి.సమరం (మీడియా), డాక్టర్ కేవీ.అనంతశయనం (సంగీతం), డాక్టర్ వజ్రగిరి జస్టిస్ (చిత్రలేఖనం), డాక్టర్ ఎంబీడీ శ్యామల (కవిత్వం), డాక్టర్ ఎల్.వరలక్ష్మి (పర్యావరణం), జి.రత్నశ్రీ (రంగస్థలం), డాక్టర్ బి.అంజయ్య (వైద్యం), డాక్టర్ సీహెచ్.స్వరాజ్యాలక్ష్మి (విద్య), డాక్టర్ ఝాన్సీలక్ష్మీకి స్త్రీశక్తి అవార్డు ప్రదానం చేస్తామని వివరించారు. ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీరాజు, విశిష్ట అతిథులుగా డాక్టర్ జగత్ శ్రీనివాస్, డాక్టర్ సమరం, డాక్టర్ ఎస్‌బీఎస్ నరసింహారావు, జి.రత్నశ్రీ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. సభా అనంతరం శ్రీ సాయి మంజీర కూచిపూడి నృత్య అకాడమి విద్యార్థినుల నృత్య ప్రదర్శన, సిల్వర్ స్టార్ మిమిక్రీ ప్రదర్శన కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

మధుమేహంపై రేపు అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: ప్రపంచ మధుమేహం నిరోధక మాసం సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 24న 'మధుమేహం– ఆహారం –జీవన సరళిలో మార్పులు' అనే అంశంపై అవగాహన సభ నిర్వహిస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక బ్రాడీపేట 2వలైనులోని ఎస్. హెచ్. ఓ. బిల్డింగులో ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే సభలో హ్యాపీ లైఫ్ క్లబ్, వెల్‌నెస్ కోచ్ కె.శ్రీనివాసరాజు పాల్గొంటారని పేర్కొన్నారు.

నెలాఖరు నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: విస్తరణ పనులు జరుగుతున్న ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్ డ్రైన్లను ఈ నెలాఖరుకి పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కోర్ట్ కేసులు, సమస్యలు లేని ప్రాంతంలో రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలిపారు. ఆయన శుక్రవారం కమిషనర్ ఏటీ అగ్రహారం రోడ్ విస్తరణ పనులను చుట్టుగుంట నుంచి కంకరగుంట ఆర్‌యూబీ వరకు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి విస్తరణ పనులు జాప్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే అనేక ఫిర్యాదులు, అర్జీలు అందాయని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి డ్రైన్ల నిర్మాణం పూర్తి చేయాలని, కోర్ట్ కేసుల సాకుతో విస్తరణ పనుల్లో జాప్యం సహించబోమని చెప్పారు. కేసులు వేసిన వారిని అవసరమైతే నేరుగా తమ దగ్గరకు తీసుకువస్తే వారి సమస్యలు, చట్ట ప్రకారం పరిష్కారంపై తగిన అవగాహన కలిస్తామని పేర్కొన్నారు. సమస్యలు లేని ప్రాంతాల్లో రోడ్ నిర్మాణ పనులు కూడా తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో నూతన డ్రైన్ నిర్మాణాల ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చామని, క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పనులు వేగంగా జరిగేలా బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యుత్ స్తంభాల షిఫ్ట్‌కి డీడీలు చెల్లించినప్పటికీ ఇంకా చేయకపోవడంపై సీసీడీసీఎల్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణం షిఫ్ట్ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ మధుసూదన్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు, రేపు స్పెషల్ క్యాంపెయిన్ డేస్

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గుంటూరు నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ సమ్మరి రివిజన్- 2025లో భాగంగా శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌ను నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో శని,ఆదివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండే వారు, ఇప్పటి వరకు ఓటు లేని వారు, ఓటర్ లిస్టుపై అభ్యంతరాలున్న వారు, ఓటు వివరాలు తప్పుగా నమోదు అయిన వారు దరఖాస్తులను అందించవచ్చని తెలిపారు. సీఈఓఆంధ్రా.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్ సైట్‌లోనూ ఫారం 6,7,8లను పూర్తి చేసుకోవచ్చని ఆయన సూచించారు.

సౌత్ జోన్ టెన్నిస్ టోర్నమెంట్‌కు నాగరాణి ఎంపిక


విద్యార్థిని నాగరాణిని సన్మానిస్తున్న డైరెక్టర్ సుభాని, తదితరులు

గుంటూరు మెడికల్: సౌత్ జోన్ మహిళా టెన్నిస్ క్రీడా పోటీలకు తమ కళాశాలకు చెందిన ఫిజియోథెరపీ డిగ్రీ విద్యార్థిని కె. చరిష్మా నాగరాణిని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ క్రీడా విభాగం ఎంపిక చేసినట్లు హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ డైరెక్టర్ డాక్టర్ సుభాని షేక్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం మణిపాల్‌లో డిసెంబర్ 3 నుండి 10 వరకు మహిళ టెన్నిస్ క్రీడా పోటీలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీలోని హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాల సమావేశ మందిరంలో చరిష్మా నాగరాణి శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ సుభాని మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి, క్రీడల ప్రాధాన్యతను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది రాష్ట్ర స్థాయి ఫిజియోథెరపీ క్రికెట్ టోర్నమెంట్స్‌లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మహీనా షేక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి. హరికృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ రవికాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు, నిరాశ్రయులకు ఆహారం పంపిణీ


భోజనం వడ్డిస్తున్న సమితి ప్రతినిధులు

గుంటూరు మెడికల్: శుభ కార్యాల్లో ఆహార పదార్థాలు మిగిలితే పార వేయకుండా తమకు అందించాలని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు కోరారు. పెదకూరపాడు మండలంలోని జలాలపురం గ్రామానికి చెందిన నల్లూరి సూరయ్య ఇంటిలో జరిగిన శుభకార్యంలో మిగిలిన ఆహారం గురించి సమాచారం రావడంతో అక్కడ నుంచి తీసుకొచ్చి గుంటూరు ప్రభుత్వ వైద్యశాల వద్ద పేదలకు, నిరాశ్రయులకు, ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులకు శుక్రవారం పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ ప్రతినిధి గుడిపూడి విజయ్ కుమార్, కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్ బెన్ని బాబు, వలంటీర్లు షేక్ మూసా, రాయపూడి అజయ్ కిరణ్ కుమార్, అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 200 మందికి భోజనాన్ని పంపిణీ చేశారు.

అధునాతన పరికరాలపై శిక్షణ అవసరం


డాక్టర్ శోభారాణితో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: భారతదేశం టెక్నాలజీ రంగంలో దూసుకు వెళుతున్న సమయంలో అధునాతన పరికరాలపై వైద్య సిబ్బందికి అవగాహన అవసరమని రీజినల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ సివిల్ సర్జన్, బ్యాక్టీరియాలజిస్ట్ డాక్టర్ జి. శోభారాణి తెలిపారు. ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు మేరకు రాపిడ్ కిట్స్ ద్వారా మైక్రో బయలజీ ఫలితాలు, డయేరియా ప్రబలిన సమయాల్లో ఉపయోగపడే కిట్స్, రాప్టర్ మిషన్స్ అండ్ నియోజిన్ కంపెనీలకు సంబంధించిన అధునాతన పరికరాలపై గుంటూరు రీజినల్ ల్యాబ్‌లో సిబ్బందికి ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఆమె చెప్పారు. అధునాతన పరికరాలపై అవగాహన కల్పించామని, దీనివల్ల ఉద్యోగులు మరింత శాస్త్రీయ పరిజ్ఞానంతో ముందుకెళ్లడానికి అవకాశం ఉందని తెలిపారు. ఢిల్లీ నుంచి రాప్టార్ మిషన్స్ అండ్ కిట్స్, నియోజిన్‌కు సంబంధించిన ప్రతినిధులు రీజినల్ లేబొరేటరీలు, నర్సరావుపేట, ఒంగోలు, విజయవాడ, గుంటూరు జిల్లాల ల్యాబ్‌ల నుంచి వచ్చిన టెక్నికల్ ఉద్యోగులు, జూనియర్ ఎనలిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు శిక్షణ ఇచ్చినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో రీజినల్ లేబొరేటరీ సీనియర్ వాటర్ ఎనలిస్ట్ వినుకొండ రాజారావు, అధికారులు డాక్టర్ షేక్ సిరాజుద్దిన్, శారద, ఉద్యోగులు జయప్రకాష్, కె.ఆర్.కె. రెడ్డి, జయలక్ష్మి, యోగేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, భాస్కరరావు, ఒంగోలు శ్రీనివాసరావు, గోవిందరావు, రామకృష్ణ, ధనలక్ష్మి, వెంకట్రావు, శ్యాంబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కొమ్మూరు(కాకుమాను): మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు.మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలోనే భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు.కార్యక్రమంలో ఎంఈవో–2 కె.విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని ఎంపీడీఓగా పవార్ స్వప్నిల్ జగన్నాథ్

పెదకాకాని: మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. పెదకాకాని మండల అభివృద్ధి అధికారిగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నెల రోజుల పాటు విధుల్లో ఉంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవార్ స్వప్నిల్ మాట్లాడుతూ మండల అభివృద్ధితో పాటు చేపట్టాల్సిన పనులు, పథకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిధిలోని కొప్పురావూరులో నిర్మిస్తున్న మినీ గోకుల్ షెడ్డు, ఉపాధి హామీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కె. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీప్రైమ్, జీఎస్టీ, అడ్వాన్స్ ఎక్సెల్ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఆ ట్రస్టు ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకాం, ఎంకాంలో ఉత్తీర్ణులై 20 నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు విజయవాడలో 45 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీప్రైమ్ ప్లస్, జీఎస్టీ ప్లస్ అడ్వాన్స్ ఎక్సెల్, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పిస్తామని తెలిపారు. సర్టిఫికెట్‌తో పాటు వివిధ ఫైనాన్స్, అకౌంటింగ్ సంస్థల్లో నెలకు రూ.18వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి

ప్రత్తిపాడు: ప్రమాదవశాత్తూ వాహనం పైనుంచి కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కొరిటాల రాధాకృష్ణ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె నాగవర్ధిని గర్భిణి కావడంతో గుంటూరులోని మీనాక్షి ఆస్పత్రిలో చేర్పించారు. భార్యను కూతురి వద్ద వదిలిపెట్టి వచ్చేందుకు ఈ నెల 20న రాధాకృష్ణ ఆమెతో ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ వదిలిపెట్టి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. ప్రత్తిపాడు మండలం బోయపాలెం సమీపంలో మోటార్ సైకిల్ స్కిడ్ అయ్యి రాధాకృష్ణ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశాడు. ఈ మేరకు కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె. నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుంటూరు రేంజ్ డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి ఫలం అందజేసి ఆశీర్వచనం ఇస్తున్న శ్రీ శృంగేరి పీఠం ఉత్తరాధాకారి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామి


శ్రీ శృంగేరి పీఠం ఉత్తరాధాకారి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామికి ఫలాలు అందజేస్తున్న పోలిశెట్టి కుటుంబసభ్యులు


శ్రీ శృంగేరి పీఠం ఉత్తరాధాకారి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామి కుటుంబసభ్యులు